# జాలి

—కె. వి. యస్. వర్మ

ఒక టౌన్‌లో
రైల్వే స్టేషన్‌లో
మండుటెండలో

ఇటువైపు ప్లాట్ ఫారమ్‌నుండి అటువైపు ప్లాట్‌ఫారమ్ మీదికి వెళ్ళడానికి కట్టిన ఓవర్ బ్రిడ్జిమీద అటూ యిటూ దీనంగా ధైర్యంగా ఆకలి చూపులు చూస్తూ కూర్చున్నారు భిక్షగాళ్లు ఆడా—మగా,

వాళ్ళు
కాల్చిపారేసిన సిగరెట్ పీకల్లా వున్నారు
వాడిపోయిన పువ్వుల్లా వున్నారు.
రెక్కలు విరిగిన పక్షుల్లా వున్నారు.

వాళ్ళముందు సిల్వర్ గిన్నెలు ఉమ్మువేసే తొట్టెల్లా వున్నాయి, ఆ గిన్నెల్లో విడిపైసలు గజ్జి కురుపుల్లా వున్నాయి.

కింద రైళ్ళు ఆగుతున్నాయి—వెళుతున్నాయి మనుషులు దిగుతున్నారు—ఎక్కుతున్నారు. అటువేపునుంచి యిటూ, ఇటువేపునుంచి అటూ హడావుడిగా నడుస్తున్నారు.

బిచ్చగాళ్ళకేసి చూస్తున్నారు, విడి పైసలుంటే వేస్తున్నారు— స్వర్గంలో తమకి స్థానం కేటాయించబడిందను కుంటున్నారు. కొందరు

చిల్లరలేదంటూ సానుభూతి చూపిస్తున్నారు. ఒక ఆసామీ పదిపైసల బిళ్ళ ఒకడికిచ్చి, మీరందరూ పంచుకోండని నలుగురికీ వినిపించేలా చెబు తున్నాడు గొప్పగా.

ఎల్లమ్మ తన గిన్నెవంక పాలుకోసం తల్లి రొమ్ముకుచూసే పసి పాపలా చూసింది. రెండు రెండు పైసలూ, మూడు పైసలూ వున్నాయి.

ఎల్లమ్మ ముందునుంచి కాళ్ళు కదులుతున్నాయి. చేతులు వూగు తున్నాయి. పైసలు మాత్రం రాలడంలేదు.

పైసలు గిన్నెల్లో పడినప్పుడు వాళ్ళ కళ్ళు మెరుస్తున్నాయి. కృతజ్ఞ తగా చూస్తున్నాయి. గంటలు గబగబా గడుస్తున్నాయి.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటున్నారు. కడుపులు తడుముకుంటు న్నారు. అలా చాలాసేపు ఓపిగ్గాచూసి ఒక్కొక్కరూ లేచి రైల్వేస్టేషన్ దాటేరు.

నెమ్మదిగా వేంకటేశ్వరుడి కోవెల చేరుకున్నారు. కోవెల వెనక్కి పోయి కూర్చున్నారు. తమ దగ్గరున్న పైసల్ని లెక్కపెట్టుకున్నారు. ఎంత తిండి దొరుకుతుందో అంచనావేసుకుంటూ ఆలోచన్లో పడ్డారు.

వాళ్ళ ఆలోచనల్లో కార్లులేవు. బార్లులేవు మోసాల్లేవు. మాయ ల్లేవు;

వేంకటేశ్వరుడి గుడిలో రంగురంగుల లైట్లు ఆకాశంతో వేలాడు తున్న నక్షత్రాల్లా వున్నట్లూ. గంట క్షయరోగి దగ్గులా వినిపిస్తూంది.

భక్తులు బయట జోళ్ళు విడిచి, దేవుడిముందు కళ్ళుమూసుకుని 'తమ జోళ్ళని ఎవరూ ఎత్తుకుపోరుగదా' అన్న ఆలోచన వచ్చినందుకు నాలుక్కరచుకుని, చెంపలు వేసుకుంటున్నారు. అరటిపళ్ళు కొందరూ, కొబ్బరికాయలు కొందరూ దక్షిణతో పూజారితెచ్చిన పళ్ళెంలో పెడు తున్నారు. అందులో మూడోవంతు ప్రసాదంగా తీసుకుంటున్నారు. కళ్ళ కద్దుకుని నోట్లో వేసుకుంటున్నారు.

అప్పులు భక్తులు, లంచం యిచ్చి తమకు కావల్సినవి 'శాంక్షన్' చేయించుకునే కంట్రాక్టర్లలా వున్నారు. వాళ్ళముందు దేవుడికివాగ్దానంచేసి నిలబెట్టుకోలేని పొలిటికల్ నాయకుడిలా వున్నాడు.

ఒక భక్తుడు తన పాత చెప్పులొదలి, సంతోషంగా, కొత్తవి తొడుక్కునిపోతే మరొకడు తన జోళ్ళుపోయేయని ఏడుస్తున్నాడు. విచారంగా .. రాత్రి పెరిగేకొలదీ భక్తుల సంఖ్య తరిగిపోయింది.

పూజారి అరటిపళ్ళ వంకా; కొబ్బరిముక్కలవంకా, పళ్ళెంలోని చిల్లరవంకా తృప్తిగా చూశాడు, ముందు తలుపులు మూశాడు. వెనక తలుపులు తెరిచాడు. లోపలి వెలుగు కొద్దిగా బయటకు వచ్చింది?

ఎల్లమ్మ పన్నెండు పైసలు పూజారి చేతుల్లో పడేసింది. పూజారి ఆరు అరటిపళ్ళు యిచ్చాడు మిగతా వాళ్ళంతా తమ దగ్గరున్న పైసలిచ్చి పూజారి దగ్గర అరటిపళ్ళు కొనుక్కున్నారు. ఆవు రావురుమంటూ అరటి పళ్ళు తినేసి, మంచినీళ్ళకోసం పరుగెత్తారు.

తర్వాత నెమ్మదిగా మామూలుగా నీరసంగా సంతపేటలోకి నడిచి రేకుషెడ్డులోకి దూరేరు. గోడకి జేరబడి ఒకరూ, పడుకుని ఒకరూ కళ్ళు మూసుకున్నారు.

చీకటి చిక్కగావుంది
గాలి స్తంభించి పోయింది.

ఎల్లమ్మ చీకట్లోకిచూసూ వాళ్ళందరికీ దూరంగా కూర్చుంది. ఆమె పక్కకి శీనయ్య వచ్చాడు. 'ఎల్లమ్మా' అన్నాడు. 'నేనే శీనయ్యనే' అన్నాడు. 'సచ్చిపోతున్నానే కొంచెం కనికరించవే. నీకు పున్నెంవుంటాది' అన్నాడు. ఎల్లమ్మ మాట్లాడకుండా వూరుకుంది. శీనయ్య ఆమెనిదగ్గరకు లాక్కున్నాడు. ఎల్లమ్మ కాళ్ళు ముడుచుకుంది.

* * *

రెండ్రోజుల ఆకలిని కడుపులో పెట్టుకుని, రెండేళ్ళ కొడుకుని ఒళ్ళో పెట్టుకుని కూర్చుంది ఎల్లమ్మ. దీనంగా ధర్మం చెయ్యమనిఅడుగుతోంది. హీనంగా బ్రతిమాలుతోంది.

కుర్రోడు ఏడుస్తున్నాడు. ఎండిన రొమ్ముల్ని నోట్లో పెట్టుకుని తన నోట్లో లాలాజలాన్ని మింగుతున్నాడు. ఎల్లమ్మ కొడుకుని బాధగా చూసింది. నీరసంగా మూలిగింది.

ఎల్లమ్మ మళ్ళీ మనసులో ఏడ్చింది—కుర్రోడ్ని కన్నందుకు, శీనయ్యపై దయ తల్చినందుకు, వాడికి లొంగినందుకు, ఎవరూ తనకి పనివ్వనందుకు, ఎక్కడా పని దొరకనందుకు, అడుక్కుంటున్నందుకు.

పట్టుచీరలూ, సాదా చీరలూ, జరీకండువాలూ, గ్లాస్కోపంచెలూ, ఖద్దరు చొక్కాలూ. నేరోకట్ పేంట్లు గుడిలోనికి ఎల్లమ్మ ముందునుంచి వెళ్తున్నాయి. చెవుల్లో పువ్వులు పెట్టుకుని వస్తున్నాయి. ముఖాలకి బొట్లు పెట్టుకుని వస్తున్నాయి.

గిన్నెలో నాలుగే పైసలున్నాయి. ఎల్లమ్మకేమీ పాలుపోవడంలేదు. కుర్రోడు గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. కడుపు కణ కణలాడుతోంది. కొన్ని నెలలుగా పూజారి వీళ్ళకి అరటిపళ్లు అమ్మడం మానేశాడు. ఎక్కువ డబ్బు వస్తుందని కాంట్రాక్టుకి ఎవడికో యిచ్చేస్తున్నాడు.

ఎల్లమ్మ ఆలోచిస్తూ కూర్చుంది. పిల్లోడ్ని సముదాయించింది, వాడు ఏడుపు ఆపలేదు. ఇంతలో ఎదురుగావున్న మిఠాయి కొట్లోనుంచి ఒక కాకి మిఠాయివుండ తన్నుకుపోయింది, షావుకారు దాన్ని తిట్టుకుంటున్నాడు చేసేదేమీలేక.

ఎల్లమ్మ పెదవులపై చిరునవ్వు మెరిసింది. మనసు ఉత్సాహంగా పెన్నుతట్టింది. కళ్లు కాంతిని పుంజుకున్నాయి.

ఎండ ఎర్రగా వుంది
ఆకాశం నిర్మలంగా వుంది
గాలి స్వచ్ఛంగా వుంది

ఎల్లమ్మ లేచింది. కుర్రోడ్ని కూర్చోబెట్టింది. గుళ్ళోకి నడిచింది.

పూజారి అరటిపళ్లూ, కొబ్బరిముక్కలూ సంచిలో వేస్తున్నాడు. పళ్లెంలో చిల్లర గుట్టలా వుంది.

ఎల్లమ్మ గుప్పెడు చిల్లర తీసింది, రెండో చేతికందినన్ని అరటి పళ్ళు పట్టుకుంది. పూజారి వెర్రిగా చూశాడు. ఎల్లమ్మ నవ్వుతూ నిలబడింది.

"ఏయ్, బుద్ధుందా నీకు? లోపలికి రావచ్చా నువ్వు? అవన్నీ యిక్కడ పెట్టు. ఈ రెండు పళ్ళు పట్టుకునెళ్ళు"

"నీ బోడి జాలి నాకక్కర్లేదు"

"ఏవిటే కూస్తున్నావ్? అవిక్కడ పెట్టు. లేకపోతే తంతాను" పూజారి కళ్ళెర్ర జేశాడు.

"నువ్వన్యాయంగా అమ్ముకుంటున్నావ్. మేమాకల్తో సస్తన్నాం. నువ్వుతంతే నేను తిరగబడి తంతాను"

"పాపం మూటకట్టుకుంటున్నావే వెధవముండా అందుకే అడుక్కు-తింటున్నావ్."

"నోర్ముయ్‌రా లంజాకొడ్కా. పాపం గురించి నాకు చెప్పకురా. అట్టాగయితే నువ్వు అడుక్కు-తినాల. అసలా దేవుడు ముండాకొడుకుంటే నిన్ను బతకనిత్తాడా" ఎల్లమ్మ సింహంలా గర్జించింది,

పూజారి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

ఎల్లమ్మ కుర్రోడి దగ్గరకొచ్చింది. వాడ్ని ఎత్తుకుంది. ఆమెలో భయంలేదు బాధలేదు. దిగులులేదు. ఎల్లమ్మ నరనరంలోనూ నూతనోత్సాహం ఆవరించింది, గుండెనిండా ధైర్యం నిండిపోయింది, శరీరం గాలిలో తేలిపోయింది.

ఇప్పుడు ఎల్లమ్మ వజ్రంలావుంది. కత్తిలావుంది. అసలైన మనిషిలా వుంది,

(సృజన, మే 72)

★★★